ఆడబిడ్డ నిధి..అందే దారేది?

- 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు
- ఏడాది దాటినా హామీ ఊసే ఎత్తని ప్రభుత్వం
- ఇప్పటికే ఒక్కో మహిళకు రూ.18 వేలు బకాయి
- దక్షిణలో 1,10,560 మంది మహిళల ఎదురు చూపు



అల్లిపురం: అధికారం కోసం మాయమాటలు చెప్పడం, బూటకపు హామీలు ఇవ్వడం, ప్రజలను ఏమార్చడంలో సీఎం చంద్రబాబు కాకలు తీరారు. ఓట్ల కోసం అలవి కాని హామీలు గుప్పించడంలో పండిపోయారు. ప్రజల ఓట్లతో పీఠం ఎక్కి, తర్వాత ఓట్లేసిన ప్రజలనే బురిడీ కొట్టించడంలో పీహెచ్‌డీ చేశారు. ప్రజలు తనను నమ్మడం లేదని తెలుసుకుని తాను మారిన మనిషినని, సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తానని 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో విస్తృతంగా ప్రచారం చేశారు. కానీ ఆయన్ని నమ్మిన అన్ని వర్గాల ప్రజలతో పాటు మహిళలకు కూడా శఠగోపం పెట్టారు. 2014 ఎన్నికల్లో డ్వాక్రా రుణ మాఫీ చేస్తానని మోసం చేస్తే.. ఈసారి అడ బిడ్డ నిధి పథకం పేరుతో మోసం చేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే 18 నుంచి 53 ఏళ్ల లోపున్న మహిళలకు ఆడబిడ్డ నిధి పథకం కింద నెలకు రూ.1500 చొప్పున, ఇంట్లో ఎంత మంది మహిళలు ఉంటే అంత మందికీ ఇస్తామని చంద్రబాబు, కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయినప్పటికీ ప్రభుత్వం ఆడ బిడ్డ నిధి పథకం ఊసే ఎత్తడం లేదు. నమ్మి ఓట్లు వేసినందుకు చంద్రబాబు తమకు మరోసారి టోపీ పెట్టేందుకు చూస్తున్నారని మహిళలు మండిపడుతున్నారు. ఆడబిడ్డ పథకం అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్ముకోవాలని ఒక మంత్రి మాట్లాడడం పట్ల మహిళలు మండిపడుతున్నారు. అధికారంలోకి వచ్చేందుకు నోటికొచ్చిన హామీలు ఇచ్చినప్పుడు ఆ సంగతి తెలియదా? అని మహిళలు ప్రశ్నిస్తున్నారు.



'కూటమి' ఆడబిడ్డ నిధి హామీ పత్రం

రూ.199 కోట్లు బకాయి పడ్డారు..

నియోజకవర్గంలోని మహారాణిపేట మండలంలో 18 నుంచి 59 ఏళ్లలోపు మహిళలు సుమారు 1,10,560 మంది ఉన్నారు. వీరికి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.1500 చొప్పున రూ.16,58,40,000 చెల్లించాల్సి ఉంటుంది. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. ఆ లెక్కన 12నెలలకు రూ.1,990,080,000 చెల్లించాల్సి ఉంది. ఏడాది గడిచినా పథకం అమలుపై మంత్రివర్గ సమావేశాల్లో చర్చించకపోవడం, ఆ ఊసే ఎత్తకపోవడంతో మహిళలకు నిరాశే మిగిలింది. సూపర్ సిక్స్‌తో పాటు ఇచ్చిన హామీల్లో ఒకటి రెండు పథకాలను అది కూడా అరకొరగా అమలు చేశారే తప్ప ఇంకా ఏ పథకాలు అమలుకు నోచుకోలేదు.

బకాయితో కలిపి ఇవ్వాలి..



టీడీపీ అధికారంలోకి వచ్చి సంవత్సరమైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు. అడబిడ్డ నిధి పథకం ఎప్పుడు అమలు చేస్తారా అని మహిళలంతా ఎదురు చూస్తున్నారు. సంపద సృష్టించి పథకాలు ఇస్తామని చెప్పారుగా.. మొత్తం బకాయితో కలిపి చెల్లించాలి.

–పశుమర్తి అలివేలు, అల్లిపురం

మోసం చేయడం తగదు..



అధికారంలోకి రాగానే మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇస్తామన్నారు. ఏడాదవుతున్నా ఆ ఊసే లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ హామీనీ అమలు చేయడం లేదు. సూపర్ సిక్స్ పథకాల కోసం ఎదురు చూస్తున్నాం. మాటతప్పి మోసం చేయడం సరికాదు.

– గుణవతి, బంగారుమెట్ట

నమ్మకం పోయింది..



ఆడబిడ్డ నిధి పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్న నమ్మకం పోయింది. ఆ పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాలంటున్నారు. హామీ ఇచ్చే ముందు తెలియదా వారికి. అధికారంలోకి వచ్చిన తర్వాత గుర్తుకు వచ్చిందా. ఈ పథకం అమలవుతుందన్న ఆశ లేదు.

– మానస, వెంకటేశ్వరమెట్ట

బుద్ధి చెబుతాం..

అధికారంలోకి రాకముందు ఒకలా, వచ్చాక మరోలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి పథకం కింద నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని కూటమి నాయకులు మహిళలను నమ్మించి ఓట్లు వేయించుకున్నారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట మరచిపోయారు. మహిళలంతా వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెబుతాం.

–ఎం.పార్వతి, బంగారుమెట్ట

కొనసాగుతున్న శ్రావణలక్ష్మి పూజలు


తులసిపూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు శనివారం రెండవ రోజుకు చేరాయి. గత 19 ఏళ్లుగా అత్యంత ప్రతిష్టాత్మకంగా శ్రీలక్ష్మి పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాద స్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అలాగే సిరులతల్లికి శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

తొలి రోజు 13 శాతం మందికి రేషన్ సరుకుల పంపిణీ

- అందుకున్న వృద్ధులు, దివ్యాంగులు

మహారాణిపేట: జిల్లాలో శనివారం 12.30 శాతం మంది దివ్యాంగులు, వృద్ధులకు ఇళ్లకు వెళ్లి రేషన్ డీలర్లు సరకులు పంపిణీ చేశారు. జిల్లాలో 5,24,986 కార్డులు ఉండగా ఇందులో 33,130 మంది వృద్ధులు, దివ్యాంగులు ఉన్నారు. వీరిలో శనివారం 4,671 మంది ఇళ్లకు వెళ్లి డీలర్లు సరకులు పంపిణీ చేశారని పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.భాస్కరరావు తెలిపారు.

క్లుప్తంగా

ప్రజలను మోసగించిన కూటమి ప్రభుత్వం


33వ వార్డులో బాబు ష్యూరిటీ మోసం.. గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వార్డు నాయకులు

అల్లిపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ప్రజలకు అమలు చేయలేని హామీలు ఇచ్చి మోసం చేసిందని 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ అన్నారు. శనివారం గడప గడపకు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు పచ్చిరపల్లి రాము, వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఆడారి వెంకట మహేష్, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, వార్డు సెక్రటరీ సంతోష్ కుమార్, మహిళా నాయకులు హేమ, సీనియర్ నాయకులు ధర్మ, పీవీఎన్ రెడ్డి, మత్స్యకార నాయకుడు చోడిపల్లి శివకుమార్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో కార్గిల్ దివస్


కార్గిల్ వీరులకు నివాళులర్పిస్తున్న క్యాడెట్లు, అధ్యాపక బృందం

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం కార్గిల్ దివస్ నిర్వహించారు. దేశ భద్రత కోసం ప్రాణాలర్పించిన వీర సైనికులకు నివాళులర్పించారు. కళాశాల ఎన్‌సీసీ యూనిట్ నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల పాల్గొని మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దేశభక్తి, సైనికుల పట్ల గౌరవం, సమాజ సేవ పట్ల చైతన్యాన్ని కల్గిస్తాయన్నారు. కార్యక్రమంలో భాగంగా కార్గిల్ దివస్ గురించి ఎన్‌సీసీ క్యాడెట్లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్గిల్ విజయాన్ని స్కిట్ రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి డాక్టర్ కె.గీతాంజలి, ఫిజికల్ డైరెక్టర్ ఆర్.కిరణ్మయి, డి.అరుణపద్మ, పలువురు క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.

పేదల సేవే సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న న్యాయమూర్తి సన్యాసి నాయుడు

విశాఖ లీగల్: విద్యార్థులు న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనలకు అనుగుణంగా ఎన్‌బీఎం న్యాయ కళాశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, అణగారిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించడం ప్రతి న్యాయవాది సామాజిక బాధ్యత అన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.సత్యసాగర్, అధ్యాపకులు ఆర్.వి.ఎ.ఎస్.ఎ. కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆది కర్మయోగి' శిక్షణ పూర్తి

తాటిచెట్లపాలెం: గిరిజన ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'ఆది కర్మయోగి' కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. గిరిజన గ్రామాభివృద్ధి దిశగా ప్రజల్లో చైతన్యం పెంచేందుకు రూపొందించిన ఈ కార్యక్రమంలో భాగంగా, విశాఖలోని బెస్ట్ వెస్ట్రన్ హోటల్‌లో ఈ నెల 23న ప్రారంభమైన రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని పూర్తి చేసుకున్న జిల్లాల అధికారులకు కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సర్టిఫికెట్లను అందజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులు చిత్తశుద్ధితో 'ఆది కర్మయోగి' కార్యక్రమ లక్ష్యాలను సాధించే దిశగా వివిధ శాఖల సమన్వయంతో, ప్రజల భాగస్వామ్యంతో మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పార్వతీపురం మన్యం జిల్లా ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులను, శిక్షణ అందించిన రిసోర్స్ పర్సన్‌లను అభినందించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌లు పీవీఎస్ నాయుడు, పి. మురళీధర్, డాక్టర్ ఎం. రమేష్ బాబు, ఎస్.వై. నూరాని, కె.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ కార్డియాలజీ విభాగానికి సుస్తీ


చంద్రబాబు, పవన్‌కల్యాన్, మాధవ్ మాస్క్‌లతో బిచ్చమెత్తుకుంటున్న కూటమి నేతలకు బిచ్చమేస్తున్న వాసుపల్లి

- రూ. 3 కోట్లు లేక నిలిచిపోయిన గుండె శస్త్ర చికిత్సలు
- జగనన్న ప్రభుత్వ హయాంలో రూ.500 కోట్లతో మహర్దశ
- పేదల ఆరోగ్యమంటే కూటమికి ఇంత నిర్లక్ష్యమా?
- కలెక్టర్‌ను సస్పెండ్ చేయాలి
- వినూత్న రీతిలో నిరసన చేపట్టిన వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఉత్తరాంధ్రుల పెద్దాస్పత్రి కేజీహెచ్ కార్డియాలజీ విభాగం పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ మండిపడ్డారు. కార్డియాలజీ విభాగానికి గుండె శస్త్ర చికిత్సకు అవసరమైన యంత్రాలు తక్షణమే కేటాయించాలని కోరుతూ శనివారం కేజీహెచ్ ఓపీ గేట్ వద్ద వినూత్న రీతిన నిరసన చేపట్టారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, పీవీఎన్ మాధవ్ మాస్కులతో పార్టీ నాయకులు, కార్యకర్తలతో భిక్షాటన చేయించారు. నిధుల్లేక ఆరు నెలలుగా పేదలకు గుండె శస్త్ర చికిత్సలు నిలిచిపోయినా, ఉన్నతాధికారులు కళ్లు మూసుకున్నారంటే చంద్రబాబు ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. మూడు కోట్ల రూపాయల విలువైన యంత్రాలు పాడైపోతే ఇప్పటి వరకు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. తన సొంత నిధులతో రూ.20 వేలు విరాళం అందిస్తూ, పారిశ్రామిక వేత్తలు, సీఎస్ఆర్ నిధులు, ఎంపీ నిధులు కేజీహెచ్ కార్డియాలజీ విభాగానికి అందించాలని వాసుపల్లి విజ్ఞప్తి చేశారు. పార్టీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ, అధికార ప్రతినిధి రామానంద్, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్‌తో కలిసి సామాజిక బాధ్యతగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి రూ.20 వేల చెక్కు అందజేశారు. అనంతరం వాసుపల్లి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజలతో పాటు జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా ప్రజలకు వైద్యం అందించే కేజీహెచ్‌లో యంత్రాల కొరత ఏర్పడిందని, గత ఆరు నెలలుగా కార్డియాలజీ విభాగంలో హార్ట్ లంగ్, టెంపరేచర్ కంట్రోలర్ మిషన్ పని చేయకపోవడంతో ఎంతో మంది పేదలు ఆయా ఆపరేషన్లు చేయించుకోలేక మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అవన్నీ ప్రభుత్వ హత్యలేనన్నారు. కూటమి ప్రభుత్వం ఆరు నెలలుగా రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయలేకపోయిందన్నారు. కనీసం కార్పొరేట్ సామాజిక బాధ్యతగా విశాఖలో పేరొందిన సంస్థల నుంచి నిధులు సేకరించలేకపోయిందని ఎద్దేవా చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కేజీహెచ్‌ను రూ.500 కోట్లతో అభివృద్ధి బాట పట్టిస్తే.. కేవలం రూ.3 కోట్ల నిధులు విడుదల చేయలేక కూటమి ప్రభుత్వం పేదోడి ప్రాణాలు బలి గొన్నదని ఆరోపించారు. కేజీహెచ్‌కు చైర్మన్‌గా ఉన్న కలెక్టర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చెన్నా జానకీరామ్, తోట పద్మావతి, దశమంతుల చిన్ని, వద్దాది దిలీప్, దశమంతుల మాణిక్యాలరావు, పీతల వాసు, ముత్తాబత్తుల రమేష్, రాజారెడ్డి, అలపన కనకారెడ్డి, ముజీబ్‌ఖాన్, భీశెట్టి ప్రసాద్, అనుబంధ సంఘాల నాయకులు ఆకుల శ్యామ్, గాలి పార్వతి, కొణతాల కృష్ణవేణి, తాడి రవితేజ, కోరాడ సురేష్, ఆరుగుల రాజ్‌కుమార్, పడాల సూర్యకుమార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కేజీహెచ్‌కు రూ.20 వేల చెక్కు అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

- ప్రజల నుంచి జగనన్నను దూరం చేయలేరు
- మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి
- 38వ వార్డులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వాసుపల్లి, జాన్‌వెస్లీ తదితరులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వం మెడలు వంచి ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి మనమందరం కలిసికట్టుగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధి 38వ వార్డులో ఆ వార్డు అధ్యరజాపు రవి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ, అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే జగన్ కంటే అదనంగా పథకాలు ఇస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం మోసం చేసిందని దుయ్యబట్టారు. సంపద సృష్టిస్తానని మాయ చేసి రాష్ట్రాన్ని రెట్టింపు అప్పుల పాలు చేస్తున్నారని మండిపడ్డారు. డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్ కేవలం సినిమా ప్రమోషన్ల కోసమే పరిమితమై అధికార దుర్వినియోగం చేస్తున్నారన్నారు. నారా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగంతో రెచ్చిపోతున్నారని ధ్వజమెత్తారు. జగనన్న పథకాలు ప్రభంజనమని, కుట్ర రాజకీయాలతో మూకుమ్మడిగా అధికారం నుంచి తప్పించగలిగారే కానీ ప్రజల మనస్సుల్లోంచి తీయలేకపోయారన్నారు. బాబు చేసిన మోసాలపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. 18 నెలల పాలనలో చంద్రబాబు, నారా లోకేష్ అరాచకాలు, కక్షపూరిత దాడులు మాత్రమే చేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సంగాబత్తుల సన్యాసిరావు, వాసుపల్లి రాజు, సారిపల్లి అరుణ, పెదగాడ బాబ్జి, పాటోజు ప్రసాద్, పాటోజు నాని, అర్జున్ ప్రసాద్, శ్రీను, కోసూరు సురేష్, కిరణ్, చేపల నూకరాజు, లండ నూకరాజు, మురళీకృష్ణ, అన్మోల్, జుత్తాడ చంద్రరావు, శీరం శేఖర్, నీలకంఠం, రమేష్ తదితర నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్: కొమ్మాది పంపింగ్ మెయిన్ లైన్ లీకేజీ కారణంగా ఈ నెల 28న జోన్-2 పరిధి పలు వార్డుల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జోన్-2 పరిధి 10వ వార్డులో వెటర్నరీ కాలనీ, రాజీవ్‌నగర్, ఇందిరా గాంధీ నగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్, వివేకానంద నగర్, నాగేశ్వరరావు పేట, రామాలయం వీధి, రవీంద్రనగర్, ఎస్ఐజీ నగర్, బీఎస్ఆర్ నగర్, 11వ వార్డు పరిధిలో కైలాస్‌నగర్, డ్రైవర్స్ కాలనీ, శివాలయం వీధి, టీఐసీ పాయింట్, శ్రీరామనగర్, గాంధీనగర్, బాలాజీనగర్, ముస్తఫా కాలనీ, వికలాంగుల కాలనీ, అన్నానగర్, తోటగరువు, సుందరయ్యనగర్, పాత ఆరిలోవ, పార్వతీనగర్, 12వ వార్డు పరిధిలో లీలా సుందర్‌నగర్, హిందీ కాలేజీ, నెహ్రూనగర్, గణబాబు నగర్, పెదగదిలి శివాలయం వీధి, పెదగదిలి పోలమ్మ టెంపుల్, వినాయకుడి నగర్, సాలిపేట, చినగదిలి, సంతపాలెం, రామలక్ష్మీపురం, నేతాజీనగర్, న్యూ శాంతినగర్‌కు సంబంధించిన అన్ని ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుందన్నారు.

అర్ధరాత్రి పారిశుధ్య పనుల పరిశీలన


పారిశుధ్య కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో రాత్రివేళల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్న వీధి కుక్కలను నియంత్రించే చర్యలు చేపట్టాలని ప్రజారోగ్య అధికారులను కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. జోన్-4 పరిధి పూర్ణామార్కెట్ పరిసర ప్రాంతాల్లో అర్ధరాత్రి పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ పరిశీలనలో కమిషనర్ పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ పనిముట్లు, యూనిఫాం, ఇతర సౌకర్యాల గురించి, అలాగే రోడ్లు శుభ్రం చేసి పోగు చేసిన వ్యర్థాలను క్లాప్ వాహనాల ద్వారా తరలించే ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళ విధి నిర్వహణలో వీధి కుక్కలు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, తద్వారా విధులకు ఆటంకం ఏర్పడుతుందని, వాటి నుంచి కాపాడాలని పారిశుధ్య కార్మికులు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ స్పందిస్తూ వీధి కుక్కల వల్ల ఆటంకం లేకుండా రక్షణ కల్పిస్తామని భరోసా కల్పించారు. సిటీ వెటర్నరీ అధికారి డాక్టర్ ఎస్.కిషోర్‌కుమార్‌ను ఆ దిశగా ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం పూర్ణామార్కెట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న వీధి కుక్కలను పట్టి, వాటికి వ్యాక్సినేషన్ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.


కమిషనర్ ఆదేశాల మేరకు వీధి కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

పోరాటాలకు సిద్ధం కండి

కంచరపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. కంచరపాలెంలోని ఒక కమ్యూనిటీ హాలులో శనివారం సీఐటీయూ విశాఖ జిల్లా 13వ మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు.. మోదీ విధానాలను శరవేగంగా అమలు చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాజధాని నిర్మాణానికి మరో 40 వేల ఎకరాల భూమిని బలవంతంగా సేకరించడం దారుణమన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనాలు రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రజా విధానాలపై వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని ఐక్యం చేసే మరిన్ని పోరాటాలకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో స్మార్ట్ విద్యుత్ మీటర్లను, సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని తీర్మానం చేశారు. అంతకుముందు సీఐటీయూ పూర్వ జిల్లా అధ్యక్షుడు వి.ఎస్.పద్మనాభరాజు సిటు పతాకావిష్కరణ చేశారు. ప్రజానాట్య మండలి కళాకారులు కార్మికులను ఉత్తేజపరుస్తూ అభ్యుదయ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఎ.అజశర్మ, కె.లోకనాథం, ఆర్.శంకరరావు, ఎం.శ్రీనివాస్, పి.మణి, పి.వెంకటరెడ్డి, ఎం.సుబ్బారావు, ఎల్.జె.నాయుడు, వై.సత్యవతి, చిరంజీవి, ఎం.చంటి, తదితరులు పాల్గొన్నారు.


సీఐటీయూ పతాకానికి అభివాదం చేస్తున్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఏడాదైనా కొత్త పింఛన్లు లేవు

- జెడ్పీటీసీ సభ్యుల ఆవేదన

మహారాణిపేట: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతున్నా వృద్ధులు, దివ్యాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయడం లేదని జెడ్పీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవరాపల్లి జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం మాట్లాడుతూ కొత్త పింఛన్ల కోసం ఎంతో మంది అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు ఎదురు చూస్తున్నారని చెప్పారు. కె.కోటపాడు జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన వారికి ఇప్పటి వరకు ఎంతమందికి పింఛన్లు ఇచ్చారో తెలియజేయాలని కోరారు. గొలుగొండ జెడ్పీటీసీ గిరిబాబు మాట్లాడుతూ తక్షణం పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అల్లూరి జిల్లాలో అధ్వానంగా విద్యావ్యవస్థ..

అల్లూరి సీతారామరాజు జిల్లాలో విద్యావ్యవస్థ అమలు సక్రమంగా లేదని పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతగిరి జెడ్పీటీసీ డి.గంగరాజు, అరకు జెడ్పీటీసీ శెట్టి రోషిణి మాట్లాడుతూ అల్లూరి జిల్లాలోని పలు మండలాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో చాలా మందికి చదవడం, రాయడం రాదన్నారు. దీనిని బట్టి విద్యా బోధన ఎలా ఉందోనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దుస్థితి నెలకొనడం చాలా సిగ్గుచేటుగా ఉందని, డీఈవో తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కొంత మంది ఉపాధ్యాయులు పాఠశాలకు రావడం లేదని, ఎక్కడ నుంచో అటెండెన్స్ వేసి వెళ్లిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన జెడ్పీ చైర్‌పర్సన్ అల్లూరి జిల్లాలో విద్యాప్రమాణాలు మెరుగుపర్చాలని, ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో రోడ్ల నిర్మాణానికి సంబంధించి డిప్యూటీ సీఎం హామీ మేరకు మూడు సార్లు టెండర్లు పిలవగా అతి తక్కువ మంది పాల్గొంటున్నారని పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు తెలిపారు. కేజీహెచ్‌లో భావనగర్ వార్డులో పారిశుధ్యం అధ్వానంగా ఉందని కొయ్యూరు జెడ్పీటీసీ నూకరాజు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజనులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఇంటర్‌బోర్డు అధికారికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆమె పేర్కొన్నారు. దీనిపై ఉన్నత విద్యాశాఖ కమిషనర్‌కు లేఖ రాస్తామని ఆమె హెచ్చరించారు.


స్థాయీ సంఘ సమావేశంలో వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్